సైనికుడి తల్లిగా గర్విస్తున్నా..



తల్లి నూర్జహాన్‌తో యాకూబ్ పాషా

కారేపల్లి: దేశం కోసం, ఇక్కడి ప్రజల కోసం పాక్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొంటున్న తన కుమారుడిని చూస్తే గర్వంగా ఉందని కారేపల్లికి చెందిన ఎస్.కే.నూర్జహాన్ వెల్లడించింది. నూర్జహాన్, మునీరుద్దీన్ కుమారుడైన యాకూబ్‌పాషా 2016లో సైన్యంలో చేరాడు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లోని లడక్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. యుద్ధం నేపథ్యాన ఎప్పుడేం జరుగుతుందోననే ఆందోన ఉన్నప్పటికీ.. తన కుమారుడు దేశం తరఫున పోరాడుతున్న గర్వం ఉందని నూర్జహాన్ తెలిపారు. క్షేమ సమాచారం తెలుసుకుంటున్నట్లు వెల్లడించింది.

తొలిసారి ప్రత్యక్ష యుద్ధంలో..



విజయరాణి, రాజేష్

వైరారూరల్: వైరా మండలం గొల్లెనపాడుకు చెందిన గంగసాని విజయరాణి కుమారుడు రాజేష్ 24ఏళ్లుగా సైన్యంలో పనిచేస్తున్నాడు. ప్రస్తుత యుద్ధం నేపథ్యాన విజయరాణిని పలకరించగా.. భారత్ తరఫున తన కుమారుడు యుద్ధంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. చిన్నతనం నుంచే సైన్యంలో పనిచేయాలనేది లక్ష్యం కాగా.. ఆర్మీలో చేరాక తొలిసారి ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొంటున్నాడని వెల్లడించారు. పది రోజులుగా కుమారుడితో ఫోన్‌లో మాట్లాడే అవకాశం దక్కలేదని, అయినప్పటికీ ధైర్యంగానే ఉన్నానని విజయరాణి తెలిపారు.

అమ్మ లాంటి దేశరక్షణలో..



మూర్తిలాల్, రాజమ్మ

తిరుమలాయపాలెం: మండలంలోని రమణతండాకు చెందిన రమావత్ రామచంద్రు – రాజమ్మ కుమారుడైన మూర్తిలాల్ పదిహేనేళ్లుగా భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సైన్యంలో చేరేటప్పుడు తల్లిదండ్రులు ఆందోళనకు గురైనా తల్లి లాంటి దేశ రక్షణ విధులకు వెళ్తున్నానని చెప్పడంతో అంగీకరించారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ తన కుమారుడు తరచుగా ఫోన్ చేసి మాట్లాడతాడని తెలిపింది. ప్రస్తుతం విశాఖపట్నంలో విధులు నిర్వర్తిస్తున్నా యుద్ధం నేపథ్యాన ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలనే సమాచారం వచ్చిందని చెప్పాడని పేర్కొన్నారు.

దేశ రక్షణ కోసం...



గుంపెన రమేష్



రామలక్ష్మి

జూలూరుపాడు: మొద్దులగూడెంకు చెందిన గుంపెన రామస్వామి(లేటు)–రామలక్ష్మి కుమారుడు రమేష్ ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నతనం నుంచే సైన్యంలో పనిచేయాలనే లక్ష్యంతో 18ఏళ్ల క్రితం చేరాడు. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. యుద్ధం నేపథ్యాన ఎక్కడైనా విధులకు వెళ్లాల్సి ఉంటుందనే సమాచారం అందినట్లు తెలిసింది. ఈ విషయమై ఆయన తల్లి రామలక్ష్మి స్పందిస్తూ దేశ రక్షణలోతన కుమారుడు పాలు పంచుకుంటుండడం ఆనందంగా ఉందని తెలిపారు.

ధైర్యంగా పంపించా...



దస్మితో భాస్కర్, ప్రసాద్

కూసుమంచి: కూసుమంచి మండలం గోరీలపాడు తండాకు చెందిన బానోతు దస్మి ఇద్దరు కుమారులు భాస్కర్, ప్రసాద్ సైన్యంలో పని చేస్తున్నారు. భాస్కర్ కేరళలో, ప్రసాద్ చెన్నైలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల దస్మీకి ఆరోగ్యం బాగా లేకపోతే భాస్కర్ స్వస్థలానికి వచ్చాడు. ఇంతలో ఫోన్ రాగానే.. భాస్కర్ బయలుదేరాడు. 'నాకు ఆరోగ్యం బాగా లేకున్నా.. దేశ సేవ కోసం వెళ్లాల్సి రావడంతో భాస్కర్‌ను ధైర్యంగా పంపించా' అని దస్మీ వెల్లడించింది. కొడుకు దేశం పోరాడుతుంటే, తండా వాళ్లంతా తనకు అండగా ఉన్నారని దస్మీ వెల్లడించింది.



అటు దేశభక్తి.. ఇటు తల్లిప్రేమ



- భారత సైన్యంలో ఉమ్మడి జిల్లా యువత
- కాల్పులు ఆగినా ఎప్పుడేం జరుగుతుందోనని తల్లడిల్లుతున్న కన్నపేగు
- మరోవక్క దేశ సేవలో తమ బిడ్డలు తరిస్తున్నారని సంతోషం

నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం



భారత్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత అందరికీ ఆందోళన కలిగించింది. యుద్ధం ఎన్నాళ్లు కొనసాగుతుందోనన్న ఆదుర్దా సామాన్యుల్లో ఉండగా, సరిహద్దు వద్ద సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న వారి కుటుంబాలను ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆవేదన వెంటాడింది. రెండు దేశాల అంగీకారంతో శనివారం సాయంత్రం కాల్పుల విరమణ ప్రకటించినా, మళ్లీ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయం సైనికుల కుటుంబాలను వీడడం లేదు. ఈనేపథ్యాన నేడు(ఆదివారం) అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న వారి తల్లులను పలకరించగా ఓ పక్క భయం.. ఇంకోవైపు ఆనందం వ్యక్తపరిచారు. తమ బిడ్డలు దేశసేవలో తరిస్తున్నారని సంతోషంగా ఉన్నా, యుద్ధం కారణంగా ఏం జరుగుతుందోననే ఆందోళన కూడా వారిలో కనిపించింది. అయితే, కన్నపేగుకు మించి తమ బిడ్డలు భారతమాత సేవలో ఉన్నారనే వారు హర్షం వ్యక్తం చేయడం విశేషం.

గర్వపడుతున్నాం...



బద్రి - చిన్న మంగ్యా



రాంబాబు

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం గాంధీనగర్‌కు చెందిన భూక్యా చిన్న మంగ్యా – బద్రి దంపతుల కుమారుడు భూక్యా రాంబాబు సైన్యంలో ఉద్యోగం చేస్తున్నాడు. డిగ్రీ చదువుకున్న రాంబాబు దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో పదేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. రాంబాబు ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. యుద్ధం నేపథ్యాన దేశరక్షణకు పాటుపడుతుండడం గర్వంగా ఉందని ఆయన తల్లి భద్రి తెలిపారు. అందరి కోసం పోరాడుతున్న తన బిడ్డకు ప్రజలందరి దీవెనలు ఉంటాయని బద్రి ధీమా వ్యక్తం చేశారు.

కొడుకు ఆశయానికి అండగా..



బచ్చల వంశీ, శారద

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వెంకటేశ్వరకాలనీకి చెందిన బచ్చల వంశీకి నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడు తండ్రి వెంకటేశ్వర్లు మృతి చెందారు. ఆతర్వాత తల్లి శారద కుమారుడి ఆలనాపాలన చూస్తోంది. భర్త లేకున్నా, ఒకే కుమారుడైనప్పటికీ సైన్యంలో చేరాలనే వంశీ సంకల్పానికి అండగా నిలిచింది. ఆయన 2019లో సైన్యంలోకి ఎంపికయ్యారు. యుద్ధం నేపథ్యాన శారద మాట్లాడుతూ కొడుకు ఎలా ఉన్నాడోననే ఆందోళన వెంటాడుతున్నా.. దేశరక్షణకు సైన్యంలో పనిచేస్తున్నాని తృప్తి ఉంటోందని తెలిపారు.

పుత్రోత్సాహం



వల్లోజు లక్ష్మీనారాయణ



సమ్మక్క

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం పోలారానికి చెందిన వల్లోజు లక్ష్మీనారాయణ ఆరేళ్ల క్రితం బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. ప్రత్యేక పరిస్థితుల్లో కొంత కాలంగా ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. పాకిస్తాన్‌తో యుద్ధం మొదలుకాగానే మళ్లీ సరిహద్దులకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన తల్లి సమ్మక్క స్పందిస్తూ.. పాకిస్తాన్‌తో యుద్ధ పరిస్థితులను ఎప్పటికప్పుడు టీవీలో చూస్తున్నానని తెలిపింది. దేశ రక్షణ విధుల్లో కుమారుడు ఉండడం తనలో పుత్రోత్సాహాన్ని నింపిందని, ఇది ఆనందంగానే కాక తమ కుటుంబమంతటికీ గర్వంగా ఉందని తెలిపింది.



విధుల్లో కారేపల్లి క్యాబిన్ బజార్‌కు చెందిన ఎస్.కే.యాకూబ్ పాషా

అటు భయం.. ఇటు గర్వం



యజ్ఞకుమారి



ఉదయ్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని రామవరానికి చెందిన దాచేపల్లి ఖాదర్‌రాజు –యజ్ఞకుమారి కుమారుడైన ఉదయ్‌కుమార్ జమ్మూలో మేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జవాన్‌గా చేరి మేజర్ స్థాయికి ఎదిగారు. ఆయన భార్య లక్ష్మీసత్య, ఏడాది కుమార్తె కూడా జమ్మూలోనే ఉండగా, వారి నివాసాని కి సమీపంలో బాంబులు పడ్డాయని సమాచారం ఇచ్చారు. ఉదయ్ తల్లి యజ్ఞకుమారి మాట్లాడుతూ ఇప్పుడు భయంగా ఉన్నా.. దేశ రక్షణలో కుమారుడు భాగస్వామ్యమైనందుకు గర్వంగా ఉందని తెలిపారు. దేశం కోసం దేనికైనా సిద్ధమేనని చెబుతాడని వెల్లడించారు.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత శ్రీవారు, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీవారికి పల్లకీ సేవ జరిగింది. ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్తంభాద్రి ఆలయంలో సుదర్శన యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం(గుట్ట)లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ సుదర్శన యాగం నిర్వహించారు. ఉదయం ప్రాత:కాలార్చన, పానకాభిషేకం, విశేష పూజలు, బాలభోగ నివేదన అనంతరం పండితులు ప్రత్యేకంగా రుణ విమోచన యోగంగా సంప్రదాయ పద్ధతుల్లో యాగం ప్రారంభించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో పూజలు జరుగుతుండగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, లక్ష్మీనర్సింహస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం సాయంత్రం గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. కొండపై ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను బయటకు తీసుకొచ్చి, కొండ చుట్టూ మాడవీధుల్లో గిరి ప్రదక్షిణం చేస్తారని, ఆతర్వాత కొండపై అర్చకులు నక్షత్ర జ్యోతిని వెలిగించనున్నారని ఈఓ వెల్లడించారు.

మూడు రోజుల్లో మస్తానికుంటకు నీరు

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన మంత్రి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: మండలంలోని సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మూడు రోజుల్లో మసానికుంటకు నీరు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం గడ్డికుంట తండా వద్ద గ్రావిటీ–5 కాల్వ, బావోజీతండా వద్ద ఉన్న రేగులకుంట చెరువును శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌లో భాగంగా చెరువులకు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. తద్వారా రేగులకుంట చెరువు నిండి అలుగు పారుతూ నల్లకుంట చెరువు, మల్లెపల్లికి చేరుతోందని చెప్పారు. మస్తానీకుంట, మంచుకొండకు కూడా మూడు రోజుల్లో నీరు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రూ.66.33 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 2,400 ఎకరాల ఆయకట్టుకు సాగర్ జలాలు అందుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఆర్డీఓ జి.నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, ఏడీఏ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లుతో పాటు మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీపక్, దేవ్‌సింగ్, నగేష్, రామ్మూర్తినాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా, అలుగుబారుతున్న రేగులకుంట చెరువు వద్ద మంత్రి పూజలు చేశారు.

జిల్లా పెద్దాస్పత్రిపై 'రెడ్‌బ్యాండ్'



ఆస్పత్రి భవనంపై వేయించిన రెడ్‌బ్యాండ్

ఖమ్మంవైద్యవిభాగం: భారత్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యాన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల భవనాల టాప్‌పై రెడ్‌బ్యాండ్ గుర్తు వేయిస్తోంది. ఇందులో భాగంగానే ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్లాబ్‌పైనా పెద్దసైజ్‌లో తెలుపు రంగు, ఆపై ఎరుపు రంగుతో క్రాస్ గుర్తు వేయించారు. ఈ గుర్తు వేయించడం ద్వారా యుద్ధ సమయాన విమానాలు, హెలికాప్టర్ల నుండి చూసినా కనిపిస్తుందని, ఈ గుర్తు ఉన్నవి ఆస్పత్రులుగా గుర్తించి శత్రుదేశాలు జెనీవా ఒప్పందం ప్రకారం దాడి చేయవని అధికారులు తెలిపారు.

సంపద పేదలకు పంచితే అన్యాయమా?

- రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు
- దొరల పాలన కోసం దోపిడీదారులు ఏకమవుతున్నారు...
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

అశ్వారావుపేట : రాష్ట్రంలో సంపద సృష్టించి పేదలకు పంచడం అన్యాయమా అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శనివారం స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'దొరల పాలన కోసం దోపిడీదారులు ఏకమవుతున్నారు.. తస్మాత్ జాగ్రత్త..' అంటూ హెచ్చరించారు. ప్రజల వద్ద డబ్బు లాగి దోపిడీ చేసేందుకు తాము అధికారంలోకి రాలేదని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రజలను జలగల్లా పీల్చేసిందని, కేసీఆర్ అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో సభలు నిర్వహిస్తూ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. గడిచిన పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు గోదావరిలో పోశారని ఆరోపించారు. రూ.7లక్షల కోట్ల అప్పు తమ ప్రభుత్వంపై వేసినా, సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేయడం లేదన్నారు. గిరిజనుల వ్యవసాయం కోసం రూ.12,500 కోట్లతో ఇందిర జల వికాస్ పథకం ప్రవేశపెడుతున్నామని, ఈనెల 18న నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, అదేరోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతుందని తెలిపారు. ఈ పథకంలో గిరిజన రైతులకు సోలార్, డ్రిప్, ఉద్యాన మొక్కలు ఉచితంగా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పేదల కళ్లలో ఆనందం చూడడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ప్రతీ తండా, గ్రామానికీ నాణ్యమైన విద్యుత్ అందించామని, ఇప్పుడు మరింత మెరుగైన సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఐటీడీఏ పరిధిలో కోటాకు మించి ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, ఐడీసీ, గిడ్డంగుల సంస్థ చైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు కేఎంసీ మద్దతు

ఖమ్మంమయూరిసెంటర్: భారత ఆర్మీ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ఖమ్మం కార్పొరేషన్ పాలకవర్గం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగులు శనివారం ప్రదర్శన నిర్వహించారు. కేఎంసీ కార్యాలయం నుండి ఆర్టీఓ ఆఫీస్ సిగ్నల్ వరకు ప్రదర్శనగా వెళ్లి మానవహారంగా ఏర్పడి సైన్యానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పాక్ దాడులను భారత సైనం తిప్పికొడుతూ ప్రజల రక్షణకు పాటుపడుతున్నందున ప్రతిఒక్కరు సంఘీభావం తెలపాలని కోరారు. కాగా, దేశ రక్షణనిధికి తనతో పాటు కార్పొరేటర్ల నెల వేతనం రూ.4లక్షల మేర విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహరా, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బీ.జీ.క్లెమెంట్, రాపర్తి శరత్, దండ జ్యోతిరెడ్డి, గజ్జల లక్ష్మివెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణనిధికి విరాళంగా నెల వేతనం



ప్రదర్శనగా వెళ్తున్న మేయర్, కార్పొరేటర్లు

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి/తల్లాడ: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. నేలకొండపల్లి మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం కార్పొరేషన్, తల్లాడ మండలాల్లో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి పర్యటించనున్న మంత్రి తల్లాడ పర్యటనలో భాగంగా పినపాకలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, మిట్టపల్లిలో గ్యాస్ లీకేజీతో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగే కార్యక్రమాల్లోనూ మంత్రి పాల్గొననున్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణానికి పాటుపడదాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లాలో భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని పార్టీ జిల్లా సంఘటన సంరచన ప్రభారీ పొనుగోడు పాపారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ నేతృత్వాన కొనసాగుతున్న ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని తెలిపారు. దేశ భద్రత, పౌరుల రక్షణే ధ్యేయంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆదర్శంగా తీసుకుని పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఈవీ రమేశ్, సన్నే ఉదయ్‌ప్రతాప్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వన విజ్ఞాన్ క్యాంప్‌లో బాలికలు




మొక్కల ప్రాధాన్యతను తెలుసుకుంటున్న విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: వేసవి సెలవుల నేపథ్యాన అటవీ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో 6 – 15 ఏళ్ల బాలబాలికల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ నేతృత్వాన కొనసాగుతున్న ఈ శిబిరాన్ని బాలల సదనం బాలికలు సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని వృక్షాలు, పక్షులపై అవగాహన కల్పించగా.. మొక్కల పెంపకం, కొబ్బరిబొండాల్లో తులసి మొక్కలు పెంచే విధానాన్ని సిబ్బంది వివరించారు. మొదటి విడత శిబిరం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉచితంగా నిర్వహించగా, వచ్చే వారం మొదలయ్యే శిబిరానికి పిల్లలు ముందుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ జి.నాగేశ్వరరావు, ఎఫ్ఎస్ఓ రమేశ్, ఎఫ్‌బీఓలు జ్యోతి, నాగమణి, కవిత, ఖాజాబీ, ఎఫ్ఎస్ఓ కవిత పాల్గొన్నారు.

మంటలు అంటుకుని వృద్ధురాలు మృతి

సత్తుపల్లి: వరిగడ్డికి అంటుకున్న మంటలు ఎగిసిపడి ఓ వృద్ధురాలికి అంటుకుని మృతి చెందింది. మండలంలోని తుంబూరు గ్రామానికి చెందిన ఓరుగంటి నాగేశ్వరమ్మ(74) తన వరిపొలంలో శనివారం గడ్డి తొలగించినిప్పుపెట్టింది. అంతలోనే ఎండ తీవ్రతతోఆమె అస్వస్థతకు గురై పడిపోయింది. దీంతో మంటలు ఎగిసిపడుతూ వచ్చి నాగేశ్వరమ్మకు అంటుకొని కాలిపోతుండగా గుర్తించిన సమీప రైతులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అంతా చేరుకుని మంటలుఆర్పేలోగా ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు



(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,000	2,000
పెసలు	7,200	4,000
కందులు	6,600	5,600
మినుములు	6,300	6,300
అలసంద	5.925	5,800
మిర్చి	13,350	5,800
మిర్చితాలు	5,600	4,050
పత్తి	7,500	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

జీవనయానంలో యోధులు

- విధి వక్రించినా, భాగస్వామి నిరాకరించినా తగ్గని తల్లి ప్రేమ
- కన్నబిడ్డల కోసం పోరాడుతున్న మాతృమూర్తులు
- జన్మతో పాటు జీవితాన్నీ ఇస్తున్న తల్లులు
- తలసేమియా చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుతున్న 'అమ్మ'

తల్లి ప్రేమను వర్ణించడానికి సరిపడా మాటలు ఉండవు.. చెప్పడానికి కాలమూ సరిపోదు. ప్రాణాన్ని లెక్క చేయకుండా బిడ్డకు ఊపిరి పోసే మాతృమూర్తి.. అదే బిడ్డకు చిన్న గాయమైనా తట్టుకోలేదు. బిడ్డకు తలసేమియా వచ్చిందని తెలిసినా.. భర్త వదిలి వెళ్లినా.. ఇంకొందరిని పేదరికం వెంటాడుతున్నా పిల్లలే సర్వస్వంగా పోరాటాన్ని సాగిస్తున్న తల్లులు ఉన్నారు. పేగు బంధాన్ని కాపాడుకునేందుకు తల్లులే పోరాడుతున్నారు. పదిహేను రోజులకోసారి బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లి రక్తం ఎక్కించి మందులు తీసుకునే ఆ తల్లులను చూస్తే అమ్మ ప్రేమను వర్ణించడం సాధ్యమా?.. నేడు (ఆదివారం) అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా కథనం – ఖమ్మంమయూరిసెంటర్



కూతురే ప్రాణంగా..

కామేపల్లి మండలం గరిడేపల్లికి చెందిన బానోతు సునీతకు 11 ఏళ్ల కుమార్తె వేదశ్రీ ఉంది. కుమార్తెకు తలసేమియా ఉన్నట్లు చిన్నప్పుడే తేలగా.. బిడ్డ ఆరు నెలల వయసులోనే సునీతను భర్త వదిలేశాడు. అప్పటి నుంచి కూలీ పనులకు వెళ్తున్న ఆమె ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కూతురే ప్రాణంగా వైద్యం చేయిస్తోంది. కుమార్తెకు వైద్యం అందిస్తూనే విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. తన కష్టానికి తోడు సంకల్ప సంస్థ సహకారంతో ముందుకు సాగుతున్నానని సునీత వెల్లడించింది.



వేదశ్రీతో తల్లి సునీత

కన్నబిడ్డలే కంటిపాపలు



శ్రీలక్ష్మితో తల్లి అంకులక్ష్మి

ఖమ్మం ఖానాపురానికి చెందిన సుంకర అంకులక్ష్మికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె, 20 ఏళ్ల శ్రీలక్ష్మి తలసేమియాతో బాధపడుతోంది. పదేళ్ల కిందట అంకులక్ష్మి భర్త చనిపోగా, పిల్లలను కంటి పాపల్లా కాపాడుకుంటోంది. శ్రీలక్ష్మికి ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించేందుకు ఆస్పత్రికి తీసుకురావడం ఆమె జీవితంలో భాగమైంది. కుటుంబ పోషణకు పాల వ్యాపారం చేస్తుండగా, బిడ్డలను ప్రయోజకులుగా చేయడమే తన జీవితలక్ష్యమని లక్ష్మి చెబుతోంది.

తోడు లేకున్నా.. అన్నీ తానై

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంనకు చెందిన పడిశాల శిరీషకు 16 ఏళ్ల కుమార్తె నయోమి ఉంది. తలసేమియాతో బాధపడుతున్న ఆమెకు చిన్ననాటి నుంచి వైద్య సేవలు అందించడం భారంగా మారింది. జీవితాంతం తోడుగా ఉంటానన్న భర్త మధ్యలో వదిలేసినా కూతురే ప్రాణంగా శిరీష జీవిస్తోంది. తోడు లేకున్నా బిడ్డను కాపాడుకునేందుకు శ్రమిస్తోంది. కూలీ పనులకు వెళ్తూనే కుమార్తెకు వైద్యం అందిస్తూ తల్లిగా జీవనపోరాటం చేస్తోంది.



కుమార్తె నయోమితో శిరీష

కన్న బిడ్డలే ప్రపంచం

ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్‌కు చెందిన మారపొంగు కవితకు పదేళ్ల కుమారుడు రాజ్‌కుమార్, మూడేళ్ల కుమార్తె తబిత ఉన్నారు. భర్త మధు ఎలక్ట్రీషియన్. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబంలో ఇద్దరు తలసేమియా బారిన పడడంతో జీవన పోరాటం చేస్తున్నారు. దీంతో భర్త పనులకు వెళ్తుండగా, కవిత బిడ్డలే ప్రపంచంగా వారిని కాపాడుకునేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతోంది. సంకల్ప సంస్థ సహకారంతో ఏ ఇబ్బంది రావడం లేదని కవిత చెబుతోంది.



రాజ్‌కుమార్, తబితతో తల్లి కవిత

కష్టాలను ఎదురొడ్డి.. పిల్లలను తీర్చిదిద్ది..



తన ఇద్దరి పిల్లలతో అరుణ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన చిట్టా అరుణకు ఇద్దరు కుమార్తెలు. 2006లో భర్త సీతారామిరెడ్డి మృతి చెందాడు. కూలి పనులు చేస్తూ జీవనం పోరాటం ప్రారంభించింది. ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి పూర్తి చేసింది. 2011లో కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో నైట్ వాచ్‌వుమన్‌గా చేరింది. జీతం సరిపోక రాత్రి నైట్ వాచ్‌వుమెన్‌గా పనిచేస్తూ ఉదయం కూలి పనులకు వెళ్లింది. తల్లి కష్టాన్ని గమనించిన పిల్లలు గ్రీష్మా, సుష్మా ఉన్నత చదువులు పూర్తి చేశారు. గ్రీష్మా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో, సుష్మా ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తోంది. భర్త చనిపోయినా అధైర్య పడకుండా ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించి అరుణ పలువురికి ఆదర్శంగా నిలిచింది.

అమ్మ ప్రోత్సాహంతో జేఎల్‌గా..

కరకగూడెం: భర్త చనిపోయినా మనోధైర్యం కోల్పోకుండా ఓ మహిళ తన కూతురిని ఉన్నత శిఖరాలకు చేర్చింది. అమ్మ కష్టం వృథా కాకుండా కూతురు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మలకం వెంకన్న – సరోజన దంపతులకు రెండో సంతానం రమాదేవి. రమాదేవి ఒకటో తరగతి నుంచి బీఈడీ వరకు గురుకుల విద్యాసంస్థలో చదువుకుంది. కేయూలో ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎంఏ ఆంగ్లం పూర్తి చేసింది. ఇంటర్‌లో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి ప్రోత్సాహంతో చదువులో ముందుకు సాగింది. గురుకుల ఉద్యోగాల్లో జేఎల్ ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ మ్యాథమెటిక్స్ ఉద్యోగాలకు ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలిచింది.



కుమార్తె రమాదేవితో తల్లి సరోజన

35 ఏళ్లు వచ్చినా పసిపాపలా..

సింగరేణి(కొత్తగూడెం): 35 ఏళ్లు వచ్చిన బిడ్డను పసిపాపలా సాకుతోంది. దివ్యాంగురాలైన కూతురిని అన్నీ తానై పోషించుకుంటోంది. కొత్తగూడెం మధురబస్తీలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పిండి జయరామ్, రాజమణెమ్మలకు నలుగురు కూతుళ్లు. ఇద్దరు సంపూర్ణ ఆరోగ్యంతో జన్మించగా వారికి వివాహాలు చేశారు. మరో ఇద్దరు దివ్యాంగులు కిరణ్మయి, ప్రణతి. వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేరు. వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా తల్లితోడు అవసరం. ఇద్దరిని తల్లి రాజమణెమ్మ కంటికి రెప్పలా కాపాడింది. 2017లో కిరణ్మయి మృతి చెందింది. ప్రణతికి ప్రస్తుతం 35 ఏళ్లు. దివ్యాంగురాలు కావడంతో తల్లే అన్ని పనులు చేస్తోంది.



ప్రణతితో తల్లి రాజమణెమ్మ





స్క్రాప్ దుకాణాల్లో మున్సిపాలిటీ సామగ్రి

వైరా: మున్సిపాలిటీ కార్యాలయ తాత్కాలిక సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో పాడైన సామగ్రి పాత ఇనప సామాన్ల దుకాణంలో కనిపిస్తుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రెండు రోజుల కిందట పాత పంచాయతీ కార్యాలయంలో ఉన్న టన్నుల కొద్ది స్క్రాప్‌ను ఎవరి అనుమతులు లేకుండా మసీద్ కాంప్లెక్స్‌లోని ఓ పాత ఇనుప సామగ్రి దుకాణానికి తరలించినట్లు తెలిసింది. పాడైన ఫాగింగ్ మిషన్లు, పాత ఇనుప సామగ్రి, ప్లాస్టిక్ పైపులను టెండర్ ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. కానీ, అలాంటిదేమీ లేకుండా విక్రయించినట్లు సమాచారం. మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చింతా వేణును వివరణ కోసం యత్నించగా ఆయన స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నందున, ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పాత ఇనుప దుకాణంలో మున్సిపాలిటీ సామగ్రి

కర్ణాటకలో సత్తా చాటిన ఖమ్మం విద్యార్థిని

బీహెచ్‌ఎంఎస్‌లో టాపర్‌గా బంగారు పతకం

ఖమ్మంసహకారనగర్: కర్ణాటక రాష్ట్రం బెల్గాం నగరంలోని ఏ.ఎం.షేక్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో ఖమ్మం నగరానికి చెందిన తుమ్మలపల్లి చరిత అత్యధిక మార్కులతో బీహెచ్‌ఎంఎస్ పూర్తిచేసింది. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన ఆమె బంగారు పతకం సాధించడమే కాక ప్రతిష్టాత్మక డాక్టర్ బత్రాస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైందని కుటుంబీకులు తెలిపారు. తాజాగా జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీ హోమియోపతి డీన్ డాక్టర్ సహిదా ఎ.శిరసాంగి చేతుల మీదుగా పట్టా, బంగారు పతకం అందుకుందని వెల్లడించారు. తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు చిన్న కుమార్తె అయిన చరిత బీహెచ్‌ఎంఎస్‌లో చేరిన కొన్నాళ్లకే రామారావు మృతి చెందారు. అయినా బాధ దిగమింగుకుని నాలుగేళ్ల కోర్సులో ఏటా మొదటి ర్యాంకు సాధిస్తూ చివరికి బంగారు పతకం సాధించడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేకు హాజరైన చరిత తల్లి విజయలక్ష్మి, కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, తన తండ్రి రామారావు కోరిక మేరకు పేద ప్రజలకు వైద్య సేవలందిస్తానని చరిత వెల్లడించింది.



బంగారు పతకం, పట్టాతో తుమ్మలపల్లి చరిత

గురునానక్ యూనివర్సిటీలో విద్యార్థిని ఆత్మహత్య

కుర్నవల్లి గ్రామంలో విషాదం

తల్లాడ: రెక్కాడితే గానీ డొక్క నిండని కుటుంబం.. దంపతులిద్దరూ బ్యాంకులో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ ఇద్దరు కుమార్తెలను కష్టపడి చదివిస్తున్నారు. ఇంతలోనే ఆ తల్లిదండ్రులు పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన అయిలూరి శేషిరెడ్డి – కృష్ణకుమారి దంపతుల చిన్న కుమార్తె భావన (22) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె శనివారం ఉదయం కళాశాల హాస్టల్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు కారణాలు తెలియరావాల్సి ఉండగా, విషయం తెలియగానే స్థానికంగా విషాదం నెలకొంది. కాగా, భావన 1 నుంచి పదో తరగతి వరకు కల్లూరు ప్రతిభ స్కూల్‌లో, ఇంటర్ ఖమ్మం శ్రీ చైతన్య కళాశాలలో ఉత్తమ మార్కులతో పూర్తిచేసింది. గురునానక్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగా, మొదటి రెండేళ్లు మంచి మార్కులే సాధించింది. ఇంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. ఈ విషయం తెలియగానే ఆమె తల్లిదండ్రుల కన్నీరు మున్నీరయ్యారు.



భావన (ఫైల్)

ఎలుకల మందు తాగి వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంనకు చెందిన చెరుకుపల్లి నాగేశ్వరరావు (41) ఎలుకల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బాధ తట్టుకోలేక ఈనెల 9న ఇంట్లో ఎవరూ లేని సమయాన ఎలుకల మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా, నాగేశ్వరరావు సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

బామ్మకు వందేళ్ల జన్మదిన వేడుక

చింతకాని: సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని పిల్లలను పెద్దలు ఆశీర్వదిస్తుంటారు. కానీ, మారుతున్న వాతావరణం, ఆహార అలవాట్లతో చాలా మందికి అది సాధ్యం కావడంలేదు. అయితే, వందేళ్లు వచ్చినా ఆరోగ్యంగా నాలుగు తరాల కుటుంబీకులతో జీవిస్తున్న ఓ బామ్మ తన శత పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకుంది. చింతకాని మండలం లచ్చగూడెంనకు చెందిన యలమద్ది సీతమ్మ వందో వేడుకలను ఆమె కుటుంబీకులు శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆమె ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో పాటు మనవలు, మనవరాళ్లు పాల్గొన్నారు. కాగా, సీతమ్మ ఇప్పటికీ ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకుంటోందని తెలిపారు.



సీతమ్మ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఎండు గంజాయి పట్టివేత

ఖమ్మంక్రైం: నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం 3.5 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శివకుమార్, బబ్లు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ నుంచి హైదరాబాద్‌కు 3.5 కేజీల గంజాయిని తరలిస్తుండగా.. నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.



నిందితులు, గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వైరాలో దొంగల హల్‌చల్

వైరా: వైరాలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వైరాలోని ఖమ్మం – సత్తుపల్లి జాతీయ రహదారి పక్కన మూడు దుకాణాలు, గాంధీచౌక్‌లోని రెండు సెల్‌ఫోన్ దుకాణాలతో పాటు ఓ బియ్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ దుకాణాల్లో 20 సెల్‌ఫోన్లు, బియ్యం దుకాణంలో రూ.5 వేల నగదు, సాయి ధనలక్ష్మి కిరాణంలో రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లగా, మరో దుకాణం షట్టర్ పగలగొట్టారు. ఒకే రోజు ఆరు దుకాణాల్లో చోరీలు జరగడంతో స్థానిక వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫెన్సింగ్ రాళ్ల ధ్వంసంపై కేసు

చింతకాని: రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కుతుంబాక గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు. ఖమ్మం కవిరాజ్‌నగర్‌కు చెందిన ఉయ్యాల సత్యంకు చింతకాని మండలం వందనం రెవెన్యూలో 5.14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి చుట్టూ ఈ నెల 1వ తేదీన రాళ్లతో ఫెన్సింగ్ వేయగా, గోపి ధ్వంసం చేశాడు. ఘటనపై సత్యం శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

దమ్మపేట: అధికారుల సంతకాల ఫోర్జరీతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా భూబదిలీ చేయించుకున్న ఘటనలో ఓ మహిళపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని మందలపల్లికి చెందిన తూముల ఈశ్వరమ్మ అదే గ్రామానికి చెందిన సాయిల వీరవెంకయ్య బతికుండగానే మృతి చెందినట్టుగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించింది. ఇందుకోసం అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయించింది. వీర వెంకయ్య కుటుంబంలో తాను కూడా ఓ కుటుంబ సభ్యురాలిగా మరో నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించింది. ఈ ఫోర్జరీ పత్రాలను దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి వీర వెంకయ్య పేరు మీద ఉన్న రెండు ఎకరాల 21 కుంటల భూమిని వారసత్వం ద్వారా గతేడాది మే 22న తన పేరున పట్టా చేయించుకుంది. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.